కొంచెం సేపటికి తెప్పరిల్లుకున్న తర్వాత తలవంచుకుని "రామారావుగారిని వివాహ మాడాలనే భావం నా కెప్పుడూ కలగలేదు. అంతే. వారిలో చెడ్డగుణాలున్నాయని కాదు నే ననేది. ఎందువల్లనో వారిమీద నాకటువంటి అభిప్రాయం కలుగలేదు. ఈ విషయంలో మీతో ఏకీభవించనందుకు క్షమించండి" అంది మెల్లగా. నేనింకేమీ మాట్లాడలేకపోయాను. ఇద్దరం బరువెక్కిన హృదయాలతో అలానే కూర్చుండి పోయాం.

రామంతో ఈవిషయాన్ని నేనుచెప్పినపుడు వాడు చాలా బాధపడ్డాడు. అయినా చదువుకున్నవాడు గాబట్టి వివాహ విషయాల్లో బలవంతాలు వుండకూడదంటూ "ఒరేయ్! ఆమె నిన్నైనా చేసుకుంటుందేమో కనుక్కుందామా?" అన్నాడు. "ఛా ఛా వూరుకో. ఎవరైనావింటే నవ్విపోతారు. నీమీద ఆభావం లేదన్నపుడు నామీద వున్నట్లా? ఆమెతో ఈ విషయం ఎత్తేవు కొంపదీసి. ఆమెకు మన మీద చెడ్డ అభిప్రాయం ఏర్పడగలదు" అన్నా. "అబ్బాయి! అవన్నీ నాకొదిలేయి. నీ కిష్టమా కాదా? ముందా విషయం చెప్పు" "మన కిష్టమయితే మాత్రం ఆమె ఇష్టపడవద్దా రామం. అసహ్యంగా వుంటుంది. ఆమె దగ్గిర ఈ విషయం ఎత్తబోకు" అన్నా. వాడేమీ పలక్కుండా నవ్వి వూరుకున్నాడు.

తర్వాత రెండుమూడు రోజులకు గాబోలు కాలేజీకి టైమయిందని హడావుడిగా బయలు దేరుతున్నా. ఇంతలోనే రామం వూడిపడ్డాడు హడావుడిగా. దబదబ శబ్దం చేసుకుంటూ లోపలికొచ్చి "ఎక్కడకోయ్ బయలుదేరుతున్నావ్? కాలేజీకా? సెలవు గీకిపారేసి స్నేహితులందరికీ టీపార్టీ చేయించు" అన్నాడు.

"ఏమిట్రా ఈ రభసంతా? ఎందుకూ? వివాహమేమైనా నిశ్చయమయిందా ఏం?"

"మరేమనుకున్నావ్? జ్యోతిర్మయీ దేవి గారు తమర్ని వివాహమాడడానికి అంగీకారం తెలిపారు. మన స్వయంవరం అడ్డం తిరిగింది. ముందొచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు నా ద్వారా ఆమెకు పరిచయమయిన వాడివయినా, నీ గుణాలు ఆమెమీద గొప్పగా పనిచేసినయ్. ఇంకెందుకు ఆలస్యం? సెలవు కాగితం గీకిపారేద్దువుగానిరా" అంటూ నవ్వుతూ డ్రాయింగు రూములోకి లాక్కువెళ్లాడు నన్ను.

---

నేటి మన బతుకు

# ఊబిలోకి....

## "ఉద్యోగి"

ఆఫీసువేళ కావస్తోంది. పీడు అన్నానికి కూచున్నాడు. అన్నంలోకి తోటకూర ఇగురూ, చింతపండు పచ్చడీ, నీళ్ల చారు.

"ఏమే, కొంత పప్పు వెయ్య లేకపోయినా ఈ తోటకూరలో? రాత్రికూడా పనికొచ్చునుగా?"

"రెండు పప్పులూ పట్టుకురావాలి."

గ్రహించుకున్నాడు. ఇంకో వారం రోజులకు జీతం రానేవస్తుంది. ఏకంగా పప్పులు అప్పుడే తెచ్చుకోవచ్చును.

"తోటకూర పులుసుచేసినా బాగుండేది."

"చింతపండు పచ్చడీ, మళ్ళీ పులుసూనా అని ఆక్షేపించరూ?... కాకపోయినా పప్పు బద్దలు కనిపించకపోతే ఆకుకూర పులుసు ముట్టరుగా?"

ఏదో ఒకటి పొట్టకింత. మధ్యాహ్నం దాకా మళ్ళీ ఆకలి కాకుండా చూసుకోవాలి మరి. కాకపోయినా-ఎందుకనుకోవటం?

చిత్రం. నిరుడూ ఇదే సంపాదనగదా, తిండి కింత ఇబ్బంది పడలేదు. జీతం రాగానే కొని

పడేస్తే పప్పూ, ఉప్పూ, చింతపండూ నెలల్లా వచ్చేవి. కనపడకుండా ఖర్చు ఎట్లా పెరుగుతున్నదో.

బ్యాంకులో డబ్బు వేసి-సంవత్సరన్నరా, ఇంకా దాటిందో కూడానూ. అప్పుడు బ్యాంకులో వెయ్యటానికి పదీ, పదిహేను ఎట్లా మిగిలేదో? తలుచుకుంటే వింతగా ఉంటుంది. తన చిన్నతనంలో బుట్టెడు బెండకాయలు బేడా కిచ్చేవారని మామగారు చెబుతూ ఉంటాడు. రెండేళ్ళ క్రితం తనకు బ్యాంకులో నలభైరూపాయలు నిలవున్నది... అన్నట్టు ఆ ఎకౌంటులో ఇంకా అయిదురూపాయలు అట్లాగే ఉన్నాయి కాబోలు. అటుకేసి వెళ్ళినప్పుడు తెచ్చుకోవాలి. ఒక్కసారి పప్పులైనా కొని ఉంచొచ్చు.

అన్నం తిని చెయికడుక్కుని వీడు ఆదరాబాదరా డ్రెస్సు చేసుకోబోయినాడు.

"ఏమే, ఇంట్లో వేసుకునే చొక్కా ఇచ్చావేం?"

"అదివరకు మీరు ఆఫీసుకు వేసుకెళ్లిన చొక్కాయేగా? చిరుగు కుట్టానే."

"కుట్టిన దానివి ఈ ఉలవకాయ కుట్టు కుట్టావేం?"

"పిగిలిందండీ. ఏం చెయ్యనూ? మాసిక వేస్తే మీరు భరించలేరాయె."

"మంచి చొక్కా లుండాలిగా?"

"రెండేగా ఉన్నాయీ? ఒకటి చాకలిదాని దగ్గరుంది. ఇంకోటి నిన్నటిదాకా తొడుక్కున్నారు."

"సరేలే."

చొక్కా చేతిలో పట్టుకుని కుట్టుకేసి చూశాడు. ఎట్లా దాన్ని వేసుకోవటం? ఇంక్రిమెంటుకోసం దరిద్రం నటిస్తున్నాడని అందరూ అనుకుంటారేమో. దరిద్రం దాచుకోలేక వాడు చాలా లోకువైపోతాడు.

"ఈసారి కుట్టించుకునే టప్పుడైనా కొస్త గట్టి చొక్కాలు కుట్టించండి. నాలుక్కాలాలపాటు పడి ఉంటాయి."

అవును. ఆబాంకులో అయిదు రూపాయలు పెట్టి ముందు రెండు గట్టిచొక్కాలు కుట్టిస్తే ప్రస్తుతానికి చొక్కాల సమస్య అంటూ ఉండదు. రంగువి, మాపుకాగేవి కుట్టిస్తే సరి. తెల్ల బట్టల రోజులయిపోయాయి. కింద టేడే ఈపాటి ఆలోచన ఉన్నట్టయితే ఇప్పుడింత దుస్థితి ఉండేదికాదు.

"ఆ కుట్టుకేసి ఎంత సేపు చూస్తున్నారో. కొస్త చిరుగుపడితే చొక్కాలు పారేసుకుంటారటండీ? మన మేం లక్షాధికార్లమా?"

చప్పున చొక్కా వేసుకున్నాడు. చెప్పులకేసి చూసేసరికి గుండె జల్లుమన్నది. రెంటికీ మడమలు అరిగాయి. ఒకదానికి మడమకింద చిల్లి కూడానూ. నెల కిందటనే మరమ్మత్తు చేయిద్దామనుకుంటే వెధవ, రూపాయి అడిగాడు.

చెప్పులు కుట్టే ప్రతివాడూ తన కాళ్ళకేసి చూసేవాడే. అప్పుడే సాహసించి మరమ్మతు చేయిస్తే ఇంకో ఆరు నెల్లదాకా తోసుకుపొయ్యేది. ఇప్పుడు రూపాయికెవ్వడూ మరమ్మతు చెయ్యడు. కొత్తజోడు కొనాలిసిందే... అసంభవం- ఆ బ్యాంకులో డబ్బుపెట్టి చెప్పులు కొనటానికి మటుకు వీల్లేదు. ఇంకో సారి చూడాలి. ఎక్కణ్ణించన్నా, ఏ బాపతన్నా ఓ పదిరూపాయలు వస్తే ఎంతో బాగుణ్ణు! చాలా దివ్యంగా ఉణ్ణు!

నిజానికి ఈచెప్పుల అలవాటు చాలాచెడ్డది. చెప్పులు రాళ్లు గుచ్చుకోకుండా ఉండటానికీ, కాళ్లు కాలకుండా ఉండటానికీ ఉపయోగించాలిగాని ఉత్త పుణ్యానికి అదో నాగరికత అని ఉపయోగించరాదు. చెప్పులు వాడేవాళ్ళ అరికాళ్లు మరీ సుకుమారంగా ఉంటాయి. ఎందుకొచ్చిన సుకుమారం?...

టైముకు ఆఫీసుకు చేరుకున్నాడు. అసలాయన ఇంకా రాలేదు. ఉద్యోగులందరూ ఇద్దరిద్దరుగా ముగ్గురు ముగ్గురుగా చేరి మాట్లాడుకుంటున్నారు. అందరి దుస్తులకేసి చూశాడు, అందరి పాదరక్షలకేసీ చూశాడు. ఎవరూ తనంత దీన స్థితిలో లేరనిపించింది.

వాళ్ళకూ తనతోబాటే జీతాలు గద. తనకింకా పిల్లా జెల్లా లేరు. వాళ్ళలో చాలా మందికి పిల్లలున్నారు. లోపం తనలోనే ఉంది. జీతంలో కాదు. ఎక్కడా కనపడకుండా దుర్వ్యయం అవుతున్నది. అవును. కామేశ్వ

్రావు చూడరాదూ! ఎన్నడూ సినిమాకి వెళ్ళడు. అతనికది శపథం. తనూ భార్యా కలిసి ఈ నెలలో ఒక సినిమా చూశారు, కిందటినెల రెండు సినిమాలు చూశారు. అంటే ఎంతయిందీ? టిక్కెట్లకే దాదాపు నాలుగు రూపాయలయింది. పైఖర్చు ఇంకో రూపాయన్నా అయివుంటుంది. అయిదు రూపాయలు! హాయిగా చెప్పులజత వచ్చేది! రెండు చొక్కాలు వచ్చేవి-గట్టివి, మాపుకాగేవి!

సినిమాకు ఉద్వాసన చెప్పాలిసిందే. ఆడబ్బు ఆదా చెయ్యాలిసిందే. ఈమాట అనుకుంటేనే వీడికి పరమానందమయింది. కాని అనుమానం ఉండనే ఉన్నది. కిందటేడు నెలకు నాలుగైదు సినిమాలు చూడటానికి డబ్బెట్లా సరిపోయేది? ఇంకో అనుమానం. ఏదో మర్యాదా అయిన ఉద్యోగం చేసుకునే తనే సినిమాలు చూడలేని స్థితిలో ఉంటే వేలిముద్రగాళ్లు ఎట్లా సినిమాలు చూస్తున్నారు? సినిమాలకు లక్షలు లక్షలు ఎట్లా వస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియలేదు.

అయినా ఒకరి సంగతి తనకెందుకు? తాను సినిమాలు కట్టిపెట్టవలసిందే. ఆ కాలం వినియోగిస్తే హాయిగా ఏ పుస్తకమన్నా చదువుకోవచ్చు.

సినిమాలమీద ఆదాచేసినట్టు పత్రికలమీద మాత్రం ఎందుకు కాదా చెయ్యరాదూ? పత్రికల కోసమూ, పుస్తకాలకోసమూ నెలకు ఎట్లా లేదన్నా నాలుగు రూపాయలు ఖర్చవుతూనే ఉన్నవి. అవి మానుకుంటే హాయిగా రోజూ పప్పుంటుంది. అన్నంలోకి తినే వాటిల్లో కాస్త బలమైనదీ చవకైనదీ అదేనాయె.

“ఏమిటోయ్ నువ్వు కూడా చిరిగిన చొక్కాలు వేస్తున్నావూ? కాస్త వెనకెయ్యటం మొదలుపెట్టినట్టుందే?”

వీడు నవ్వాడు, తాను తన జీతంలోనుంచి వెనకవేస్తున్నట్టు సాటివాళ్ళు భ్రమపడ్డందుకు- కనీసం భ్రమపడ్డట్టు మాట్లాడినందుకు- పరమానందమయింది.

“ఏదీ ఒక్క మంచి సిగిరెట్టిచ్చుకో.”

“కొనాలి. పొద్దున పెట్టె కొంటే అయిపోయాయి.”

అబద్ధమాడాడు. పొద్దున లేచి ఇప్పటికి రెండే సిగిరెట్లు కాల్చాడు. ఈ సిగిరెట్లు ఖర్చు కూడా తగ్గించాలిసిందే. రోజుకు పెట్టే, పెట్టెన్నరా కూడా అయిపోతాయి. ఇందులో ముష్టి కూడానూ! కాల్చేదేదో మంచి సిగిరెట్లే కాల్చాలనే సిద్ధాంతం గలవాడు వీడు. రెండేళ్ల క్రితం గోల్డ్‌ఫ్లేక్ కొనేవాడు. సిగిరెట్లు ధరలు పెరిగాక కాప్‌స్టన్‌కు మారాడు. మళ్లా ధర పెరిగాక వుడ్‌బెన్‌కు మారాడు. ఇప్పటికీ రోజుకు ఎనిమిది, పదణాలు సిగిరెట్లకే అయిపోతున్నాయి.

వెంకట్రావు నిర్భయంగా, నిర్మోహమాటంగా స్టార్ మార్కు కాల్చేస్తాడు. తను కూడా ఆపని చెయ్యగలిగితే రోజుకు అయిదారణాలు— నెలకు కనీసం పదిరూపాయలు— ఆదా అవును! పదిరూపాయలు! ఇంటి అద్దెలో నాలుగోవంతన్న మాట.

కాని ఎట్లా అకస్మాత్తుగా మారటం? కాల్చిన సుఖం ఉండకపోగా అందరూ ఎగతాళి చేస్తారేమో? వెంకట్రావుకేం? మహారాజు. బోలెడంత ఇతర రాబడివుంది. తోచక ఉద్యోగం చేస్తున్నాడు. అటువంటివాడు చవక సిగిరెట్లు కాల్చటంకూడా ఒక అందమే. ఏదీ అనరు చూసేవాళ్లు. హైద్రాబాద్ నవాబు చార్మినార్ సిగిరెట్లు కాలుస్తారట, మాసికలువేసిన బట్టలు కట్టుకుంటారట. ప్రతి చచ్చు గుమాస్తానూ ఆపని చెయ్యమంటే సాధ్యమా?

సాధ్యం చేసుకోవాలి మరి. నెలకో పది రూపాయలు ఆదాచేసే మార్గముంటే ఎందుకు పోనివ్వాలి? ఇంత కాటకం రోజుల్లో...

పాపం, రంగారావు ఇవాళ కూడా గంట ఆలస్యంగావచ్చాడు. రంగారావింకా ఎక్కువ రోజు లీ ఉద్యోగంలో ఉండడు. రోగిష్టి భార్యా, ముగ్గురు రోగిష్టి పిల్లలూనూ. పై దిక్కు లేదు. నిజమో అబద్ధమో గాని ఆడపనీ మగపనీ అంతా చేస్తాట్ట. బయటిపనీ ఇంట్లో పనీ చేస్తాట్ట. నెలకు పదిరోజులు తిండి తినకుండా వస్తాడు ఆఫీసుకు. దరిద్రుడికి పెళ్ళాం బిడ్డలమీద మమకారం ఉండరాదు. బతికితే బతుకుతారు చస్తే చస్తారన్న వైరాగ్యం ఉండాలి. అన్నిటికీ ఈశ్వరుడే ఉన్నాడన్న విశ్వాసంతో గుండె రాయి చేసుకోవాలి.

రంగారావు ఏ రోజూ పత్రిక చదవడు. అతనికి అసలు ప్రపంచం గొడవే లేదు. కిందటి నెల ఎవరో కొరియా యుద్ధం మాట ఎత్తితే కొరియా ఏమిటన్నాడు. మెకార్థరును బర్తరఫు చేశారని నిన్న ఎవరో చెబితే మెకార్థరెవరని అడిగాడు. కాని అతనికి వైద్యవిధానాలలో ఆసక్తి జాస్తి. ఎలోపతీకన్న హోమియోపతీ చాలా మంచిదనీ, హోమియోపతీకన్న ద్వాదశ లవణ చికిత్స అత్యద్భుతమనీ బల్లగుద్ది వాదిస్తాడు. అతనికి దేన్నిగురించీ బాగా తెలీదు. కాని అతని విశ్వాసాలు కేవలం అతని దారిద్ర్యాన్నిబట్టి వచ్చాయి. రేపు ఎవరైనా సర్వరోగనివారిణి ఉందని చెబితే దాన్ని నమ్ముకుంటాడు మానవుడు. ఆలస్యంగా వస్తున్నందుకు చాలాసార్లు చీవాట్లు తిన్నాడు. పని బాగా చేస్తాడని అతన్ని తీసెయ్యలేదు. ఈ మధ్య అదీ పాడుగానే చేస్తున్నాడు. ఎప్పుడో ఈ కాస్తా పోతుంది. పాపం, రంగారావును చూస్తుంటే ఉరిశిక్ష పడినవాణ్ణి చూస్తున్నట్టుంటుంది. ఈ ఉద్యోగంపోతే ఆత్మహత్య చేసుకుంటాడేమో కూడానూ.

మధ్యాన్నం లంచికి అందరూ లేస్తున్నారు.

“వస్తావుటోయ్?”

“పొద్దున కాస్త జాస్తి అయినట్టుగా ఉంది. ఈపూట తిండి మానితేనే మంచిది. నువు వెళ్ళిరావే.”

జేబులో డబ్బులేవని సూర్యనారాయణ కనుక్కుంటాడా? ఆకలి దహించుకుపోతోంది. పొద్దున తిన్న తిండి అప్పుడే హరించుకుపోయింది. అంతగా అయితే ఏ మూడున్నర దాకానో ఓర్చుకుని కాస్త కాఫీ తాగేస్తే సరిపోతుంది.

ఇంటికిపోయి కాస్త పెందలాడే తిండి తినవచ్చు. కాకపోతే ఒక్క అర్ధణా వేరుశనగకాయలు తిని చెంబెడు మంచినీళ్లు తాగితే తీరిపోతుంది. వేరుశనక్కాయలు చెడ్డబలం! కాఫీ హోటలు టిఫిన్, వెధవది, దాని ముందాగదు. అందుకనే గాంధీ మహాత్ముడు కూడా వేరుశనగపప్పు తినేవాడు. అది దరిద్రుడి సద్భోజనం...

సాయంత్రం ఇంటికివచ్చేటప్పుడు ట్రాములో కూర్చుని పక్కవాళ్లసంభాషణ ఆలకిస్తున్నాడు.

“డబ్బుకేమిటోయ్? కుక్కను కొడితే రాల్తుంది. మనదేశానికి కమ్యూనిజం ఎందుకు పనికిరాదో నిరూపిస్తూ వ్యాసం రాసి అమెరికా వాళ్లకియ్యి, డబ్బిస్తారు”

కమ్యూనిజం వొట్టి పాపిష్టిదికదా, అది ఓ దేశానికి పనికిరాదుగదా అందరూ - అంటే రాయటం చాతయిన వాళ్లందరూ—అమెరికా దగ్గిర్నుంచి డబ్బెందుకు తీసుకోరూ? శుద్ధ అబద్ధం. ఆ అబ్బి కోస్తున్నాడు. పాపం, వినే వాళ్లు వొట్టి బుద్ధిహీనుల్లా ఉంది, అతన్ని ఖండించటం లేదు. విషయం మారింది.

“రాత్రిపూట ధాన్యం బళ్లమీద పంపుతూండగా పట్టుకున్నారు. మేజస్ట్రేటుదగ్గిర హాజరుపెట్టారు. అవును నాది ధాన్యం అన్నాడు. ఉన్నదంతా చెప్పేశాడు. ఏమిటి రాసుకుంటావు నీ మొహం? నీ జీవితం నాపాలిగాడి జీవితమంత లేదు’ అని చక్కాపోయాడు. సమన్లు జారిచేశారు. కాని ఏడీ? రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షు ఎన్నికల హడావుడిలో సహాయంచేస్తూ తిరుగుతున్నాడని తెలిసింది! సమన్లూ లేవు, చుట్టుబండలూ లేవు.

డబ్బు సంపాదించేమార్గాలు అంతులేకుండా చెబుతున్నారు—ఒకరి తరవాత ఒకరు.

ఒక్క వెధవకూడా ఈ పద్ధతులతో డబ్బు చేసుకునే దమ్ములేదు. అంతా కబుర్లు చెప్పేవాళ్ళే. ఛీ! అనుకున్నాడు. అంతా కబుర్లు చెప్పేవాళ్ళే! రాజకీయవేత్తల దగ్గర్నుంచీ ట్రాములలో డబ్బు సంపాయించే మార్గాలు చెప్పేవాళ్ళదాకా అందరూ కబుర్లు చెప్పేవాళ్ళే! వెధవకబుర్లు, వెధవ అప్రయోజకత్వం. వెధవజీవితం!

“ఏమండీ అన్నం బొత్తిగా తక్కువ తిన్నట్టున్నారేం?”

ఏముంది తినటానికి? నీళ్ళచారుతో వీడు మటుకెంతని తింటాడు?

“మధ్యాహ్నం టిఫిన్ కాస్త బరువుగా పడిందల్లే ఉంది. అన్నట్టు జేబులో వేరుశనగ పప్పు పొట్లాం ఉండాలి చూడు. నా కొక్కాస్త పెట్టి నువ్వు కాస్త తిను. వేరుశనగపప్పెంత బలమనుకున్నావు?”